



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

అంబరాన్నంటిన.. సంబరం



కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

- కాకినాడలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, కెనరా బ్యాంక్ ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన
- వెల్లువలా తరలివచ్చిన మహిళలు: రంగురంగుల ముగ్గులతో సంక్రాంతి శోభ
- కనుమరుగవుతున్న సంప్రదాయాలను కాపాడుతున్న ఆంధ్రజ్యోతికి అభినందనలు: మాజీ మేయర్లు పావని, సరోజ
- విజేతలకు నగదు బహుమతులు అందజేత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/కాకినాడ సిటీ/కార్పొరేషన్:

రంగురంగుల రంగవల్లులు ఆకట్టుకున్నాయి. రకరకాల ముగ్గులు చూడముచ్చటగా అనిపించాయి. కాకినాడలో ఆదివారం "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" అట్టహాసంగా జరిగాయి. దీనికి లోకల్ స్పాన్సర్‌గా సానా సతీష్ ఫౌండేషన్ వ్యవహరించింది. నగరంలోని మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీలకు మహిళలు భారీగా తరలివచ్చారు. రంగురంగుల ముగ్గులతో అలరించారు. ప్రతిఒక్కరినీ అబ్బురపరచిన ముగ్గులు సంక్రాంతి శోభను తలపించాయి. ఉదయం 10.30గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగిన ఈ పోటీల్లో 52మంది మహిళలు పాల్గొన్నారు. విభిన్న అంశాలపై అచ్చెరువొందించే ముగ్గులు అలంకరించారు. హరిదాసులు, ధాన్యపు సిరులు, అమ్మవార్లను, చెరకు గెడలు, గొబ్బెమ్మలతో ముగ్గులు గీశారు. ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథులుగా మాజీ మేయర్లు, టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర పావని, జనసేన నేత పోలసపల్లి సరోజ హాజరయ్యారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా యాపిల్ స్కూల్ కరస్పాండెంటెంట్ జ్యోతి శ్రీధర్, మరో న్యాయనిర్ణేతగా వైదేహి హాజరయ్యారు. మాజీ మేయర్ పావని ప్రసంగిస్తూ 15ఏళ్లుగా ఆంధ్రజ్యోతి యాజమాన్యం ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముగ్గుల పోటీలు అనగానే తన చిన్నప్పటి రోజులు గుర్తుకు వస్తాయన్నారు. ధనుర్మాసం నెల రోజుల పండుగలో మహిళలు వేసిన ముగ్గు వేయకుండా సంస్కృతీ, సంప్రదాయాలను కొనసాగించడం ఎంతో గొప్ప విషయంగా పేర్కొన్నారు. గెలిచిన వాళ్లే విజేతలు కాదని, గెలవని వాళ్లు కూడా విజేతలేనన్నారు. మరో మాజీ మేయర్ సరోజ మాట్లాడుతూ పండగ వాతావరణంలో ముగ్గులు వేయడానికి మహిళలు ఎంత ప్రాధాన్యమిస్తారో అందరికీ తెలుసన్నారు. ఇంటిముందు ముగ్గు వేయడంవల్ల ఆరోగ్యపరంగాను ఎంతో కీలకమన్నారు. ముగ్గులు సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం ఏటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండడం గొప్ప విషయమన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్ మాట్లాడుతూ ఆంధ్ర జ్యోతి ఏబీఎన్ ముగ్గుల పోటీలు కుటుంబ కార్యక్రమంగా మారిపోయిందన్నారు. అతిథులు పాతవారే, న్యాయనిర్ణేతలు పాతవారే, ముగ్గులు వేసేవారు పాతవారే అన్నంతంగా అనుబంధం ఏర్పడిందన్నారు. భారతీయ సంస్కృతి ముగ్గులతో ముడిపడి ఉందన్నారు. ముగ్గులు వేయడం ఆరోగ్యానికి మంచిదన్నారు. బ్యూరో ఇన్‌చార్జి చుక్కా అప్పారావు మాట్లాడుతూ ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా మహిళలు భారీగా తరలివస్తూ ఆదరించడం గొప్ప విషయమన్నారు. ముగ్గుల పోటీలతో ముందే సంక్రాంతి కళ వచ్చినట్లయిందన్నారు. న్యాయనిర్ణేత యాపిల్ స్కూల్ కరస్పాండెంటెంట్ జ్యోతి శ్రీధర్ మాట్లాడుతూ మహిళలు ఇంట్లో అందరికీ ఆకలితీర్చే అన్నపూర్ణగా ఉంటారన్నారు. ఆడవారి వ్యక్తిత్వం ఏదొక రంగుతో ముడిపడి ఉంటుందన్నారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలను ప్రకటించారు. కాకినాడకు చెందిన పి.ఈశ్వరి ప్రథమ బహుమతి సాధించి రూ.6వేల నగదు బహుమతి అందుకున్నారు. ఆమె ముగ్గు ప్రథమ బహుమతి కింద ఎంపికవడంతో ఈశ్వరి భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. తన కష్టానికి తగిన గుర్తింపు వచ్చిందని ఆనందభాష్పాలతో చెప్పారు. రాజమహేంద్రవరానికి చెందిన సృజన ద్వితీయ బహుమతి దక్కించుకోగా రూ.4వేల నగదు బహుమతి అందుకున్నారు. పిఠాపురం మండలం విరవాడకు చెందిన దుర్గ తృతీయ బహుమతి కింద రూ.3వేలు అందుకున్నారు. తదుపరి స్థానాల్లో నిలిచిన మరో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందజేశారు. ముగ్గుల పోటీలకు హాజరైన 52మందికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఆంధ్రజ్యోతి సిబ్బంది, అతిథులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ప్రకటనల విభాగం నుంచి పట్టాభి, ఏబీఎన్ కెమెరామెన్ శ్రీను,ఆంధ్రజ్యోతి కాకినాడ విలేకరులు రామరాజు, కుమార్, సాయిరాం పాల్గొన్నారు.

చెప్పలేనంత సంతోషంగా ఉంది
-ఈశ్వరి, ప్రథమ బహుమతి విజేత



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. చుక్కల ముగ్గులను తర్వాత తరానికి అందించేందుకు ముగ్గుల పోటీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మా అక్కతో పోటీలు చూడడానికి వచ్చేదాన్ని. ఇప్పుడు నేనే విజేతగా నిలవడంపట్ల ఆనందంతో కన్నీళ్లు వచ్చేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు
-సృజన, ద్వితీయ బహుమతి విజేత



ఏటా ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. ఈ ఏడాది రెండో బహుమతి వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఈ అవకాశం కల్పించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు. ఈపోటీలు మాలో ఆత్మవిశ్వాసం నింపుతున్నాయి.

ఆనందంగా ఉంది
-దుర్గ, తృతీయ విజేత



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో ఐదేళ్ల నుంచీ పాల్గొంటున్నాను. ఈ ఏడాది మూడోబహుమతి పొందినందుకు ఆనందంగా ఉంది. ఇంతమంది మహిళలతో పోటీల్లో పాల్గొనడం ఆనందాన్నిస్తోంది.





ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌ఛార్జి అప్పారావు, ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్‌లకు జ్ఞాపికలు అందజేస్తున్న టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పావని, జనసేన నేత పోలసపల్లి సరోజ

1



మొదటి స్థానంలో నిలిచిన ముగ్గు



బహుమతి అందుకుంటున్న ఈశ్వరి

2



రెండోస్థానంలో నిలిచిన ముగ్గు



బహుమతి అందుకుంటున్న సృజన

3



మూడోస్థానంలో నిలిచిన ముగ్గు



బహుమతి అందుకుంటున్న దుర్గ

టీఎన్‌టీయూసీ కార్మిక చైతన్య బస్సు యాత్ర
రూట్ మ్యాప్ షెడ్యూల్ విడుదల



రూట్ మ్యాప్ షెడ్యూల్ విడుదల చేస్తున్న పార్టీ పరిశీలకుడు నాగేశ్వరరావు

కాకినాడ సిటీ, జనవరి 7: టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్మిక చైతన్య బస్సు యాత్ర రూట్ మ్యాప్ జోన్-2 షెడ్యూల్‌ను కాకినాడ పార్లమెంట్ టీడీపీ పరిశీలకుడు నాగిడి నాగేశ్వరరావు విడుదల చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ యాత్రలో కార్మికుల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలను కార్మికులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోన్-2 ఇన్‌చార్జి సబ్బతి ఫణేశ్వరరావు, అమలాపురం మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టీఎన్‌టీయూసీ నగర అధ్యక్షుడు గుజు లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పసుపులేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

- తునిలో టీడీపీ శ్రేణులు సమావేశం



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న కృష్ణుడు

తుని రూరల్, జనవరి 7: జగన్ పాలనలో తీవ్రంగా నష్టపోయిన ప్రజలను సంఘటిత పరుస్తూ జగన్ పాలనలో విధ్వంసాలను వివరిస్తూ చంద్రబాబు తలపెట్టిన రా.. కదలిరా సభ ఈనెల 10న తునిలో విజయవంతం చేసేందుకు కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తుని పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత, తుని టీడీపీ ఇన్‌చార్జ్ యనమల దివ్యతోపాటు నియోజకవర్గానికి చెందిన కీలక నాయకులు సమావేశమయ్యారు. నియోజకవర్గంనుంచి 50వేలమంది పైబడి ప్రజలను సభకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లపై నాయకులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, మోతుకూరు వెంకటేష్, ఇనిగంటి సత్యనారాయణ, దాడి రాజబాబు, అప్పన రమేష్, చొక్కా అప్పారావు ఉన్నారు.

అక్రమంగా మద్యం రవాణా!

- యానాంనుంచి కాకినాడకు తరలింపు
- అడ్డూ అదుపూ లేకుండా బెల్ట్ దుకాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

సర్పవరం జంక్షన్, జనవరి 7: కాకినాడలో యానాం మద్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రోజుకు 400నుంచి 500 కేసుల మద్యం అక్రమ మార్గం ద్వారా ఇక్కడకు రవాణా అవుతోంది. ఫలితంగా కాకినాడ రూరల్, సిటీ బయట ప్రాంతాల్లో మద్యం ఏరులై పారుతోంది. ఫలితంగా అడ్డూ అదుపూ లేకుండా గ్రామాల్లో బెల్ట్ షాపులు ఎక్కడిబడితే అక్కడే దర్శనం ఇస్తున్నాయి. రాజకీయ నాయకుల పైరవీలు, ఒత్తిళ్లతో వీటిని నియంత్రించడంలో సంబంధిత ఎక్సైజ్‌శాఖ(ఎస్ఈబీ) అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉదయం 11నుంచి రాత్రి 9గంటల వరకు ఉంటే మిగతా సమయాల్లో బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు అనధికారికంగా సాగిస్తున్నారు.

యథేచ్ఛగా మద్యం విక్రయాలు

కాకినాడ రూరల్ మండలంలో తీరప్రాంత గ్రామాలు అధికంగా ఉండడం, సిటీకి నాలుగు దిక్కులా వ్యాపించి ఉండడంతో బెల్ట్ షాపులు రోజుకో చోట పుట్టగొడుగుల్లా రాజకీయ నాయకుల అండతో పుట్టుకొస్తున్నాయి. కిళ్లీ కొట్లు, రోడ్డు పక్కన ఉన్న డాబాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. యానాంనుంచి కాకినాడకు అడ్డదారుల్లో బైక్‌లు, ఆటోలు, సముద్ర మార్గాన మద్యం సరఫరా అవుతోంది. యానాం నుంచి గ్రాంటు, తాళ్లరేవు, గాడిమొగ, భైరవపాలెం, సముద్ర మార్గాన మద్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి పరిమితికి మించి మద్యం బాటిల్స్ కొనుగోలు చేసిన నిర్వాహకులు వీధి చివర, ఇంటి పక్కన, రోడ్డుపక్కన అనే తేడా లేకుండా పాన్ దుకాణాలు, కిరాణా దుకాణం, హోటల్స్, రోడ్డు పక్కన డాబాల్లో అనధికారికంగా బెల్ట్ మద్యం విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.

తీరప్రాంతాలే టార్గెట్

కాకినాడ రూరల్, సిటీలో ఉన్న తీరప్రాంత గ్రామాల్లో అధికంగా బెల్ట్ దుకాణాలు కొనసాగుతున్నాయి. ఉప్పలంక, తూరంగి, పగడాలపేట, డ్రైవర్స్ కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, బుల్లబ్బాయిరెడ్డి కాలనీ, అయ్యప్ప కాలనీ, రాజుల తూరంగి, వెలమల తూరంగి, సూర్యారావుపేట, వాకలపూడి, హార్బర్‌పేట, నేమాం, గొడారిగుంట, ఎన్ఎఫ్‌సీఎల్ ప్రాంతం, వలసపాకల తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలకు సమాంతరంగా పక్కనే ఉన్న కిళ్లీ కొట్లు, ఖాళీస్థలాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నారు. నడకుదురు తదితర చోట్ల రోడ్డు పక్కన ఉన్న డాబాల్లో అనధికారికంగా మద్యం విక్రయాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. అక్రమ మద్యం, సారా అక్రమ రవాణా నివారణ కోసం ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేసేవారు. ప్రత్యేకంగా అధికారులు, సిబ్బంది ఉండేవారు. దీంతో విస్తృతంగా దాడులు చేయడం, కేసుల నమోదు చేసేవారు. సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ఈ శాఖను పోలీసుశాఖతో కలిసి విలీనం చేసి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ)ని ఏర్పాటు చేయడంతో అక్రమ మద్యం, నాటుసారా తయారీ, రవాణాపై దాడులు నిర్వహించడం, కేసులు నమోదు చేయడంలో శాఖల మధ్య సమన్వయలేమితో అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఎస్ఈబీ ఆధ్వర్యంలోనే ఎక్సైజ్‌శాఖ కలిసి పనిచేయాల్సి రావడంతో సొంతంగా ఎక్సైజ్‌శాఖ దాడులు చేయడం, కేసు నమోదు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఎస్ఈబీకి ప్రత్యేకంగా అధికారులు, సిబ్బంది లేకపోవడం, ఉన్న సిబ్బందితో పని చేయాల్సి రావడం, ఎక్సైజ్‌శాఖ సమన్వయంతో పనిచేయాల్సి రావడం వంటి కారణాలతో బెల్ట్ దుకాణాల నిర్వాహకులకు మూడు పువ్వులు ఆరుకాయల్లాగా వరంగా మారింది. గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను అరికట్టాలని ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఉత్సాహంగా కాకినాడ సీపోర్ట్స్ సిల్వర్‌జూబ్లీ మారథాన్



కాకినాడలో మారథాన్ పరుగులో పాల్గొన్న విద్యార్థులు, వెటరన్స్

సర్పవరం జంక్షన్, జనవరి 7: కాకినాడ సీపోర్ట్స్ 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కాకినాడ సీపోర్ట్స్ సిల్వర్‌జూబ్లీ మారథాన్ 6వ ఎడిషన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మారథాన్ పరుగును సీవోవో ఎం.మురళీధర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోజులో కొంత సమయాన్ని ఆరోగ్యం, దేహదారుఢ్యం కోసం కేటాయించాలన్నారు. 3, 5, 10, 21 కిలోమీటర్ల కేటగిరీలో పరుగు పోటీలు నిర్వహించగా ఈ పోటీల్లో చిన్నారులు, యువకులు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వైడీ రామారావు, జీఆర్టీ హోటల్స్ జీఎం శివకిరణ్, దేవీ సీఫుడ్స్ జీఎం శ్రీకాంత్ పాల్గొనగా పోటీల్లోని విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- ఒకరి ఇంటిపై పెట్రోల్ పోసి తగులబెట్టే ప్రయత్నం.. కేసు నమోదు

కాకినాడ రూరల్, జనవరి 7: ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు వరకు వెళ్లింది. దీనికి సంబంధించి ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి. కాకినాడ రూరల్ మండలం యానాం రోడ్డులోని తూరంగి శివకృష్ణ కాలనీలో యర్రా రమణ, గార్ల సాయి అనే ఇద్దరు నివాసముంటున్నారు. కొన్ని రోజుల క్రితం వీరి మధ్య కోళ్ల విషయమై వివాదం తలెత్తి రమణ మీద సాయి దుర్భాషలాడాడు. తాను స్వామి మాలలో ఉండగా అలా అనవచ్చా అని రమణ అనడంతో మాల తీసిన తర్వాత వస్తానని సాయి హెచ్చరించాడు. ఆదివారం రమణ ఇంటికి సాయి వెళ్లి పాలిథీన్ కవర్‌లో పెట్రోల్ పోసి తగులబెట్టే ప్రయత్నం చేసినట్లు ఇంద్రపాలెం ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం జరగ్గా కర్రలు, రాళ్లతో కొట్టుకోవడంతో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయన్నారు. యర్రా రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి

తెలుగులోనే రాయండి, సంతకం చేయండి
నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్
రాజమహేంద్రవరం గైట్‌లో ఘనంగా ముగిసిన అంతర్జాతీయ తెలుగు మహాసభలు


గవర్నర్ గణేశన్‌ను సత్కరిస్తున్న దృశ్యం


చైతన్యరాజుకు సత్కారం


సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి7 మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థలు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా గైట్ ప్రాంగణంలో జరుగుతున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమాపనోత్సవ సభలో గవర్నర్ గణేశన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు వారంతా తెలుగులోనే రాయడం, సంతకం చేయడం చేయాలని కోరారు. ఇంతవరకు దీనిని పాటించనివారు ఈ సభ నుంచి వెళ్లినప్పటి నుంచి దీనిని ఆచరించాలన్నారు. పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడైనా తల్లులు తెలుగులోనే మాట్లాడాలని కోరారు. పిల్లలు తల్లుల నుంచే తెలుగును నేర్చుకుంటారని, తల్లులే ఇంగ్లీషులో మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. తనకు గుజరాత్ మిత్రుని ఇంటి వద్ద రైలు ప్రయాణంలో భాష గురించి ఎదురైన అనుభవాలు వివరించారు. తమ పూర్వీకులు వందలాది సంవత్సరాలు కిందట ఆంధ్రా నుంచి తెలంగాణకు వలస వెళ్లిపోయారని, తాను తెలుగు అర్థం చేసుకోగలను కానీ, చక్కని తెలుగు మాట్లాడలేనన్నారు. తెలుగు మాట్లాడడం రానందుకు బాధగా ఉందని గవర్నర్ అన్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చుకున్న రాష్ట్రంలో, దేశంలో అందరికి తెలుగు అవసరమన్నారు. మరో విశిష్ట అతిథి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి అకుల వెంకట శేషసాయి మాట్లాడుతూ ఏ జాతి భాషను, సంస్కృతిని నిర్లక్ష్యం చేస్తుందో ఆ జాతి అంతరించిపోతుందని గాంధీజీ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. అమ్మ భాష నేర్చుకోవడం అమ్మ పొత్తిళ్ల నుంచే పిల్లలకు ప్రారంభం అవుతుందని, అందువల్ల అమ్మ భాష పరిరక్షణకు అమ్మలే నడుం కట్టాలని కోరారు. మరో విశిష్ట అతిథి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి వి.దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ యువత వైజ్ఞానికంగా అభివృద్ధి చెందినప్పటికి తమ మాతృ భాషను సంస్కృతిని మర్చిపోతే నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఏ సమాజం తమ మూలాలను మర్చిపోతుందో ఆ సమాజం పతనం కాక తప్పదన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రభుత్వం కూడా ప్రతి ఏడాది జిల్లాకో ప్రాంతంలో నిర్వహించి, అందరూ పాల్గొనేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. సినీ నటుడు అలీ మాట్లాడుతూ తెలుగు గడ్డ తమకు సాయం చేసిన వారి రుణం ఉంచుకోదని అందుకు సర్ ఆర్థర్ కాటన్‌కు మన ప్రాంతంలో కనిపించే విగ్రహాలే నిదర్శనమన్నారు. ప్రేమ, అనురాగం, అప్యాయత, అభిమానం చూడాలంటే ఈ గడ్డ మీదే ఉం టుందన్నారు. సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు మహాసభలను ఆత్మీ యంగా నిర్వహించారని, ఇది ఎందరికో స్ఫూర్తికావాలన్నారు. గ్రామగ్రామాన తెలుగు భాష విరా జిల్లాలి, సంప్రదాయ సంగీతం విని పించాలని ఆకాంక్షించారు. తెలుగు భాషలో ఉన్న మాధుర్యాన్ని వివరిస్తూ ఆలపించిన గేయానికి కరతాళ ధ్వనులు మిన్నంటాయి.

పూర్ణకుంభ పురస్కారాలు...

సినీ నటుడు అలీ, దివంగత నటుడు కృష్ణంరాజు సతీమణి ఉప్పలపాటి శ్యామల, కూచిపూడి నృత్యంలో వేదాంతం రాధేశ్యాంకు పూర్ణకుంభ పురస్కారాలను గవర్నర్ లా గణేశన్ అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు గురించి గజల్ శ్రీనివాస్ వివరిస్తున్న సమయంలో శ్యామలాకృష్ణంరాజు భావోద్వేగానికి లోనయ్యారు. అలాగే తెలుగు భాష పరిరక్షించేందుకు తాను నిర్వహిస్తున్న ఈ సభలు కోసం గత రెండేళ్లుగా ఆదిభిక్షువుగా మారానని గజల్ శ్రీనివాస్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, పుష్పాల శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఐవీ రావు, సినీ నటుడు గౌతంరాజు, విశ్రాంత న్యాయమూర్తి గ్రంధి భవానీప్రసాద్, విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, కలికివాయి సుజాతారావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు ఎల్లలు లేవు

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 7: తెలుగు భాషకు ఎల్లలు లేవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అకుల వేంకట శేషసాయి అన్నారు. అంతర్జాతీయ తెలుగు మహా సభల్లో భాగంగా గిడుగు రామ్మూర్తి వేదికపై మాతృభాష ఉనికి, కర్తవ్యాలు, తెలుగు భాష, మనో విజ్ఞాన శాస్త్ర సదస్సు ఆదివారం నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను ఈ సభల ద్వారా స్ఫూర్తి పొందేందుకు ఉపన్యాసాలు విని ఆనందించడానికి వచ్చానన్నారు. దాదాపు వందేళ్ల క్రితమే ఆంధ్ర మహాసభ తెలంగాణాలోని జోగిపేటలో పుట్టిందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా వ్యవస్థాపకులు కమలాకర్ రచించిన 99వ పుస్తకాన్ని, చారిత్రక పరిశోధకులు ర్యాలి ప్రసాద్ సంకలనం చేసిన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర పండిత పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్రకుమార్, నన్నయ వర్సిటీ తెలుగు శాఖ సహాయాచార్యులు తరపట్ల సత్యనారాయణ, ఆంధ్ర సారస్వత పరిషత్ ముఖ్య సంచాలకులు కేశిరాజు రాంప్రసాద్, పీపీఏఐ రాష్ట్ర అధ్యక్షుడు వి.జనార్థనం తదితరులు పాల్గొన్నారు.


సినీ నటుడు అలీని పూర్ణకుంభ పురస్కారంతో సత్కరిస్తున్న గవర్నర్


సినీ హీరో కృష్ణంరాజు భార్య శ్యామలకు పూర్ణకుంభ పురస్కారం ప్రదానం


సభలో మాట్లాడుతున్న జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

సామర్లకోట, జనవరి 7: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రైలు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సెక్షన్ పరిధిలో సామర్లకోట మీదుగా ఐదు సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు రైల్వే ఉన్నతాధికారి కార్యాలయం నుంచి సమాచారం అందింది. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి నుంచి ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది. 07066 నంబరు గల సికింద్రాబాద్-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 10 తేదీ బుధవారం ఒక ట్రిప్ బయలుదేరనుంది. ఈ రైలు బుధవారం సికింద్రాబాద్‌లో రాత్రి 7.00 గంటలకు బయలుదేరి పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, భీమవరం, తణుకు, నిడదవోలు మీదుగా రాజమండ్రికి గురువారం తెల్లవారుజామున 5.15 నిమిషాలకు చేరుకుని కాకినాడకు ఉదయం 7.10కి చేరుతుంది. 07067 నంబరు గల కాకినాడ-సికింద్రాబాద్ మధ్య సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం జనవరి 11 తేదీ రాత్రి 9.00కి బయలుదేరి, సామర్లకోటకు 9.20కి చేరుకుంటుంది. రాజమండ్రికి 10.10కి చేరుకుంటుంది. నిడదవోలు, తణుకు, భీమవరం, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు శుక్రవారం ఉదయం 8.50కు చేరుతుంది. 07251 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-తిరుపతి మధ్య జనవరి 13న శనివారం సాయంత్రం కాకినాడలో సాయంత్రం 5.10 గంటలకు బయలుదేరుతుంది. సామర్లకోటకు 5.25కి చేరుకుంటుంది. రాజమండ్రికి రాత్రి 6.20కి చేరుకుంటుంది. నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా తిరుపతికి ఆదివారం తెల్లవారుజామున 4.30కి చేరుతుంది. 07250 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్-కాకినాడల మధ్య జరి 17న బుధవారం సాయంత్రం 6.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలు దేరనుంది. పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలుల మీదుగా రాజ మండ్రికి అర్ధరాత్రి 2.40కి చేరుతుంది., సామర్లకోటకు తెల్లవారుజామున 3.35కి చేరుకుని కాకినాడకు గురువారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుకుంటుంది. 07253 నంబరు గల సంక్రాంతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-సికింద్రాబాద్ మధ్య జనవరి 16న మంగళవారం సాయంత్రం 5.10కు కాకినాడలో బయలు దేరుతుంది. సామర్లకోటకు సాయంత్రం 5.25కి చేరుకుని, రాజమండ్రి రాత్రి 6.20కి చేరుకుంటుంది., నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి మీదుగా సికింద్రా బాద్‌కు బుధవారం తెల్లవారుజామున 5.20కి చేరు కుంటుంది. మరిన్ని వివరాలకు, రైలు రిజర్వేషన్ టిక్కెట్లకు సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్ర దించాలని రైల్వే ఉన్నతాధికారి అందించిన సమాచారంలో తెలిపారు.

యానాం ప్రజా ఉత్సవాలు అదుర్స్

యానాం, జనవరి 7: యానాం జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో ఫల, పుష్ప ప్రద ర్శన కొనసాగుతోంది. ప్రజా ఉత్సవాలను పురస్కరించుకుని ఈ ప్రదర్శనను నిర్వ హిస్తున్నారు. మూడు రోజులపాటు జరిగే ఫలపుష్ప ప్రదర్శన సోమవారం రాత్రితో ముగు స్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని కడియం, రాజమండ్రి, బెంగళూరు ప్రాంతాల నుంచే కాకుండా యానాం వ్యవసాయ శాఖ, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పెంచుతున్న వివిధ రకాల జాతులు ప్రదర్శనలో ఉంచారు. ఇవే కాకుండా వివిధ రకాల ఆకృతులతో బొకేలు, డ్రై ఫ్లవర్ బొకేలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రాంగణంలో వివిధ రకాల కాయగూరలు, పూల మొక్కలు చెట్లను ఉంచారు. సుమారు యాభైకి పైగా వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. వివిధ జాతుల దేశ విదేశీ పుష్పాలు ఒకే చోట కనబడడంతో పూల ప్రేమికులు మంత్రముగ్ధులయ్యారు.


ఆకట్టుకుంటున్న పుష్ప ప్రదర్శన

సందడే..సందడి

యానాంలో జరుగుతున్న 20వ యానాం ప్రజా ఉత్సవాల్లో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల నృత్యాలతో యానాం బాలయోగి క్రీడా మైదానం సందడిగా మారింది. యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, పుదుచ్చేరి పర్యాటక శాఖ సంయక్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రజా ఉత్సవాలలో రెండో రోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. స్థానిక కళాకారుల ప్రత్యేక నృత్య ప్రదర్శన, ఫ్యాషన్ షో అలరించాయి. ముఖ్యంగా విశాఖపట్నానికి చెందిన విక్టరీ ఈవెంట్ మేకర్స్ మేడిది విక్టర్, హైదరాబాద్‌కు చెందిన ఆర్ ప్యాక్టర్స్ అధినేత వీఎస్ రాజు ఆధ్వర్యంలో కలకత్తా కళాకారుల నృత్య ప్రదర్శన, ఫ్యాషన్‌షో, మధురైకి చెందిన ట్విన్ జగ్లర్ అశోక్, ఆనంద్ స్కిల్‌షో, రాజమండ్రి గోకవరానికి చెందిన మాల్‌మస్తీ ప్రత్యేక అడ్వంచర్ షో, జెట్టీ మూవీ ఫేమ్ అనుష్ సినీ డ్యాన్స్, మణిపూరి క్లాసికల్ నృత్య ప్రదర్శన చూపరలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పర్యవేక్షించారు. ఎస్పీ రఘునాయగం ఆధ్వర్యంలో సీఐ షణ్ముగం బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, మున్సిపల్ కమిషనర్ ఆరుల్ ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.


ఫ్యాషన్ షో


డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహిస్తున్న దృశ్యం

క్రైస్తవులు, దళితులు వైసీపీకి ఓటేయకూడదు

కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం


మాట్లాడుతున్న జేడీ శీలం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 7: 'మణిపూర్‌లో హీనమైన సంఘటనలు జరుగుతుంటే పార్లమెంట్‌లో వైసీపీ ఎంపీ ఒక్కరు కూడా ఎందుకు మాట్లాడలేకపోయారు. నా దళితులు, నా బడుగు వర్గాలు, నా అన్నలు, నా క్రైస్తవులు అన్న వారంతా ఏమయ్యారు. క్రైస్తవులు, దళితులు ఈ రోజు వైసీపీకి ఓటు వెయ్యకూడదు' అని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జేడీ శీలం అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సామాజిక సమాలోచన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ ముఖ్య నేతలతో పాటు సీపీఐ, ఆమ్ ఆద్మీ, రిపబ్లికన్ పార్టీ, పలు ప్రజాసంఘాలు, కుల సంఘాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేడీ శీలం మాట్లాడుతూ బీజేపీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ కావాలి అని కోరుకునే అన్నివర్గాల వారితో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇండియా కూటమి తరహాలో రాష్ట్రంలోనూ కూటమి ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. బీజేపీ పాలనలో రాజ్యాంగపరమైన పాలన సాగడంలేదని, అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏడు గ్యారంటీలు అమలు చేస్తామని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంతోపాటు అమరావతిలో రాజధాని నిర్మిస్తామని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ రక్షించుకుంటామని, ప్రత్యేక హోదా ఇస్తామని పేర్కొన్నారు. రాయలసీమ, ఉత్తర కోస్తాకు ప్రత్యేక ప్యాకేజీలు, బీసీలు, దళితులకు ప్రత్యేక మేనిఫెస్టో ఉంటుందన్నారు. కాంగ్రెస్‌లోకి షర్మిలరాకతో ఉత్సాహం పెరిగిందని ఆయన అన్నారు. జాతీయ న్యాయవాదుల సంఘం నాయకుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు దళితుల హక్కులను హరిస్తున్నాయని, బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ సామాజిక సమాలోచన సమావేశాలు నిర్వహించడం మంచి ఆలోచన అని అన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక, దళిత వ్యతిరేక విధానాలపై బీజేపీయేతర శక్తులన్నీ ఏకం కావాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సాకే శంకర్, రాష్ట్ర నాయకులు శ్రీపతి ప్రకాష్, కొరివి వినయ్‌కుమార్ మాట్లాడారు. సమావేశంలో తాళ్లూరి విజయ్‌కుమార్, ముళ్ల మాధవ్, ఆకుల భాగ్యలక్ష్మి, మార్టిన్ లూథర్, రఫీయుల్లా బేగ్, అజాం బేగ్ మహ్మద్, దళిత నాయకులు సానబోయిన రామారావు, నక్కా వెంకటరత్నం, కేకే సంజీవరావు, గంధం బాబ్జి, వడయార్ పాల్గొన్నారు.

మొగళ్లమూరులో అంబేడ్కర్ విగ్రహం తొలగింపు: ఉద్రిక్తత


విగ్రహం తొలగింపుతో ఆందోళన నిర్వహిస్తున్న మహిళలు

అల్లవరం, జనవరి 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరు బస్టాప్ వద్ద దళితులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పోలీసులు తొలగించడంతో ఉద్రిక్తత తలెత్తింది. విగ్రహం తొలగించిన ప్రాంతంలో సుమారు 12 గంటల పాటు ధర్నా నిర్వహించి ఆందోళనకు దిగారు. ఆదివారం తెల్లవారుజామున అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన సమాచారంతో పోలీసులు ఆ విగ్రహాన్ని తొలగించి పంచాయతీ కార్యాలయంలో ఉంచారు. దీంతో పోలీసులు మోహరించారు. మాజీ ఎంపీపీ కొనుకు బాపూజీ, నాతి శ్రీనివాసరావు, సాధనాల వెంకట్రావు, చింతా రామకృష్ణ, గూటం సత్యనారాయణ, చింతా భాస్కరరావుతో పాటు దళిత నాయకులు మహిళలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. గతంలో విగ్రహం ఏర్పాటులో వివాదాలు ఉన్నాయి. మొగళ్లమూరులో ఎంపీ చింతా అనురాధ స్వగృహం వద్ద డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, రూరల్ సీఐ వి.వీరబాబు సాధనాల వెంకట్రావు, గెడ్డం సురేష్‌బాబు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, కొనుకు బాపూజీ తదితరులు జరిపిన చర్చలు కొలిక్కిరాలేదు. అంబేడ్కర్ విగ్రహాన్ని అక్కడే పెట్టాలని దళితులు డిమాండ్ చేశారు. శాంతి భద్రతలు సమస్యలు వస్తాయని సామరస్యంగా ఉండాలని డీఎస్పీ అంబికాప్రసాద్ సూచించారు. తహసీల్దారు ఎస్‌ఎస్‌ఎస్ ప్రసాద్, ఎస్ఐలు జి.హరీష్‌కుమార్, జి.వెంకటేశ్వరరావు, దేవసుధ, జి.నాగేశ్వరరావులతో పోలీసు బలగాలు ఆ ప్రాంతంలోకి మోహరించాయి. దళితులు ఎట్టి పరిస్థితుల్లో విగ్రహం పెట్టాలని హుకుం జారీచేశారు. చివరకు ఆదివారం రాత్రి 7.45లకు తొలగించిన స్థలంలో ఎంపీ చింతా అనురాధ, డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, నాయకుల సమక్షంలో ప్రతిష్ఠించి ముసుగువేశారు. సుమారు 12 గంటల పాటు కొనసాగిన దళితుల ఆందోళనకు తాత్కాలికంగా తెరపడింది.

'రా కదలిరా' బహిరంగ సభను విజయవంతం చేయాలి

కాకినాడ సిటీ, జనవరి 7: కాకినాడ పార్లమెంట్ పరిధిలోని తుని నియోజకవర్గంలో ఈ నెల 10న జరగబోయే చంద్రబాబునాయుడు 'రా కదలిరా' బహిరంగ సభను విజయవంతం చేయాలని కాకినాడ రూరల్ నియోజకవర్గం కార్యక్రమ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో రూరల్ ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, జనసేన ఇన్‌చార్జి పంతం నానాజీ, రూరల్ నియోజకవర్గ అబ్జర్వర్ కుడిపూడి సత్తిబాబు, రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్, పార్లమెంట్ ప్రధాన కార్య దర్శి పెంకే శ్రీనివాసబాబా, కాకినాడ రూరల్ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, నురుకుర్తి వెంకటేశ్వరరావు, కాలా సత్తిబాబు, డీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.


అమలాపురంలో..

సందడిగా..

అమలాపురంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ


మాట్లాడుతున్న హరీష్‌బాలయోగి

అమలాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వ హిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన" ఆదివారం వైభవంగా జరిగాయి. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలకు లోకల్ స్పాన్సరర్‌గా జీఎం హరీష్ బాలయోగి వ్యవహరించారు. ఆంధ్రజ్యోతి యాడ్స్ మేనేజరు పి.కృష్ణారావు, సర్క్యులేషన్ మేనేజరు బి.గోపాలకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి ఎ.వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు నగదు బహుమతులను స్పాన్సర్ హరీష్ బాలయోగి అందజేశారు. ముగ్గురికి కన్సోలేషన్ బహుమతులు, మరో ముగ్గురికి ప్రత్యేక కన్సోలేషన్ బహుమతులు అందజేయగా, పోటీల్లో పాల్గొన్న అందరికీ గిఫ్టులు అందజేశారు.

కాకినాడలో ఉత్సాహంగా..


మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు

కాకినాడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన" వైభవంగా జరిగాయి. జిల్లాస్థాయిలో ఈ పోటీలకు లోకల్ స్పాన్సరర్‌గా సానా సతీష్ ఫౌండేషన్ వ్యవహరించింది. ఈ ముగ్గుల పోటీల్లో 52 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాకినాడ మాజీ మేయర్లు, టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర పావని, జనసేన నేత పోలసపల్లి సరోజ హాజరయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి మంగేష్, బ్యూరో ఇన్‌చార్జి చుక్కా అప్పారావు అతిథులుగా హాజరయ్యారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా యాపిల్ స్కూల్ కరస్పాండెంట్ జ్యోతి శ్రీధర్, మరో న్యాయనిర్ణేతగా వైదేహి వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు బహుమతులను సానా సతీష్ ఫౌండేషన్ తరఫున అతిథులు అందజేశారు. ముగ్గురికి కన్సోలేషన్ బహుమతులు, మిగిలిన వారందరికీ గిఫ్టులు అందించారు.

అలరించిన వేదగోష్ఠి


వేదగోష్ఠి నిర్వహిస్తున్న పండితులు

అనపర్తి, జనవరి 7 : అనపర్తిలోని ఉమా రామ లింగేశ్వర వేదశాస్త్ర పరిషత్ 31వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అనపర్తిలోని టీటీడీ కల్యాణ మండపంలో వేదగోష్ఠి నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి తరలివచ్చిన 12 మంది వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలతో ప్రాంగణం మార్మోగింది. వేద పండితుడు రెడ్డి సురేష్‌శర్మ మాట్లాడుతూ వేదం అణువణువున నాదం అన్నట్లుగా వేద ఘోష స్వస్తితో లోక కల్యాణం కోసం నిర్వహించే ఇలాంటి వేద శాస్త్ర పరిషత్ సభలు ప్రకృతి వైపరీత్యాలను అదుపు చేసేందుకు ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. అనంతరం వేద పండితులను యువ పారిశ్రామికవేత్తలు నల్లమిల్లి మురళీ మోహన బాలకృష్ణారెడ్డి, నల్లమిల్లి వెంకటరామారెడ్డి సోదరులు వేద పండితులకు నూతన వస్త్రాలను, దక్షిణ తాంబూలాలను అందించి సత్కరించారు. మారెళ్ల గంగరాజుశర్మ, రెడ్డి రామ్మోహనరావు, మేడపాటి చెల్లారెడ్డి, కర్రి సాంబశివరెడ్డి, తమలంపూడి చినఆదిరెడ్డి, పీవీఎన్ సూర్యనారాయణ, కొవ్వూరి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వరలయ సుధా వాయిద్య సమ్మేళనం

అనపర్తిలోని శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన పెరవలి విజయభాస్కర్ బృందం నిర్వహించిన స్వరలయ సుధా వాయిద్య సమ్మేళనం అలరించింది. అనంతరం సమితి ప్రతినిధులు బృంద ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని వెంకట రమణమ్మ ఆధ్యాత్మిక ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివేకానంద సీడ్స్ చైర్మన్ సత్తి జనార్ధనరెడ్డి, వీవీఆర్ సుబ్రహ్మణ్యం, కొవ్వూరి రామారెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడికి ప్రత్యేక పూజలు

అన్నవరం, జనవరి 7: రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం పలువురు ప్రముఖులు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామిని దర్శించిన వారిలో కేరళ హైకోర్టు పూర్వపు చీఫ్ జస్టిస్ మంజుల చెల్లూరు, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, శ్రీశైలం దేవస్థానం ఈవో జి.పెద్దిరాజు తదితరులు వేర్వేరుగా స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో దామెర కృష్ణారావు తదితరులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

లోవ దేవస్థానం కిటకిట


దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్,జనవరి7: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నలు మూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. తల్లి దర్శనార్థం ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో గల వసతి గదులు, ఆరుబయట వంట షెడ్డుల్లో సేదదీరి కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయాల్లో వివిధ విభాగాల నుంచి రూ.1.66 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

యల్లవరం సమీపంలో చిరుత సంచారం

భయం గుప్పెట్లో గిరిజనం

అడ్డతీగల, జనవరి7: అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం యల్లవరం సమీపంలో చిరుత సంచారం ఆదివారం కలకలం రేపింది. యల్లవరం చెరువు సమీపంలో చిరుత ఓ శునకంపై దాడి చేయడంతో పరిసర ప్రాంతంలో ఉన్న స్థానికులు కేకలు వేయడంతో చిరుత అటువైపుగా ఉన్న కొండపైకి పరుగులు తీసిందని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. దీనిపై అడ్డతీగల అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీ అధికారులు చిరుత పులిగా నిర్ధారించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారి సాహెంషా సూచించారు.

కాకినాడ

నేడు 'డయల్ యువర్ కమిషనర్, స్పందన'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 7: కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ అనంతరం స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ నాగనరసింహారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి 08842357800 నెంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునని ఆయన చెప్పారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

పెద్దాపురం, జనవరి 7: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెలో భాగంగా పొర్లు దండాలతో నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి సిరిపురపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొడదాం'

పిఠాపురం, జనవరి 7: అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొడదామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీ, కత్తులగూడెం ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువత జనసేనలో చేరారు. వారందరికి శ్రీనివాస్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న రోజుల్లో జనసేన, టీడీపీ ప్రభుత్వం ఏర్పడటం తథ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వం మునిగిపోతున్న నావ అని తెలుసుకుని ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బయటకు వస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

'టీడీపీకి మద్దతు ఇవ్వాలి'

కాజులూరు, జనవరి 7: ప్రజా సంక్షేమం కోసం టీడీపీకి మద్దతు ఇవ్వాలని రామచంద్రపురం టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం కోరారు. ఆదివారం మండలంలోని తనుకువాడ, గొల్లపాలెం చీకట్లవారిపేట, ఆర్యవటం తుమ్మలపల్లి లంక, ముత్తావారి గరువు, చందాలవారి పేట ప్రాంతాల్లో శెట్టిబలిజ నాయకులు, సంఘీయులతో సమావేశాలు నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు పేపకాయల బాబ్జీ, నాయకులు రాయుడు లీలాశంభర్, వనుం వీరబ్రహ్మం, మున్సిపల్ మాజీ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, ఎస్సీసెల్ నాయకుడు పోతుల మాధవ, కాళా సత్యనారాయణ మాష్టారు, పెంకే అప్పన్న, వీ వెంకట్రావు, రెడ్డి శేషారావు, గీసాల రాజు, వల్లు అర్జునరావు, పలివెల ఇజ్రాయిల్ రాజు, మేడిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, కె.రాఘవ పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేన ప్రభుత్వంతో మేలు'

తుని రూరల్, జనవరి 7: టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే అన్నివర్గాలకు మేలు జరుగుతుందని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య తెలిపారు. ఏవీ మల్లవరం గ్రామంలో రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో ఆదివారం ఆమె ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతి,అక్రమాలకు కేరాఫ్‌గా మారిన వైసీపీ పాలకులను ఇంటికి పంపించాలని.. టీడీపీ,జనసేన ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యనమల శివరామకృష్ణన్, చిటికెల శ్రీనివాసరావు, మోతుకూరి వెంకటేష్ పాల్గొన్నారు.

'కార్మికులను మోసం చేసిన అనపర్తి ఎమ్మెల్యే'

పెదపూడి, జనవరి 7: భవన నిర్మాణ కార్మికులను మోసం చేసిన ఘనుడు అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అని మండలంలోని అచ్యుతాపురత్రయంలో శ్రీభక్తాంజనేయ భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు కరెడ్ల కృష్ణార్జునరావు విమర్శించారు. ఏపీత్రయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంఘానికి మీటింగ్ నిమిత్తం భవనం కావాలని 2014లో కోరగా వైసీపీ అధికారంలోకి రాగానే ఖచ్చితంగా నిర్మించి ఇస్తానని సూర్యనారాయణరెడ్డి తెలపగా అప్పటి నుంచి వైసీపీ అధికారంలోకి వచ్చేందుకు తమ వంతు కృషి చేసామన్నారు. 2019లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం భవన విషయం అడుగగా కనీసం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైన భవనాన్ని నిర్మించి ఎమ్మెల్యే చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు

కాజులూరు, జనవరి 7: మండలంలోని గొల్లపాలెం జడ్పీ హైస్కూలు గ్రౌండ్‌లో మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా యూటీఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై ఐక్యతను చాటారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐవీ రావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అన్నవరం, పూర్వపు కార్యదర్శి వర్మ, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ అరుణకుమారి తదితర ప్రముఖులు ప్రసంగించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు నగేష్, ఉపాధ్యక్షురాలు బీ.నాగమణి, ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి జయప్రకాష్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవు సదానందమూర్తి, మండల యూటీఎఫ్ నాయకులున్నారు.

ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో ప్రచార సభ

సామర్లకోట, జనవరి 7: త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృత ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని నవర గ్రామంలో ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో ప్రచార సభ నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ప్రభోదసేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ (రాజమండ్రి) అధ్యక్షులు శేఖర్‌బాబు మాట్లాడుతూ కోరికలు, కర్మలు పూర్తిగా లేకుండా పోతే ఉత్తరాయణం రోజు మోక్షం కలుగుతుందన్నారు. అందుకే సంక్రాంతిని పెద్ద పండుగ అని చెప్పారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతులను పలువురికి అందజేశారు. శాంతరాజు, అన్నవరం, ఆదిబాబు, లోహిత, సోమినాయుడు, సత్యవతి పాల్గొన్నారు.

భూ హక్కు చట్టంపై మధ్యంతర ఆదేశాలు

ప్రత్తిపాడు, జనవరి 7: భూ హక్కు చట్టంపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని ఐలాజ్ రాష్ట్ర కన్వీనర్ బుగతా శివ చెప్పారు. ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం మేరకు న్యాయశాఖ చర్యలు చేపట్టాలని కోరారు. ఐలాజ్ ప్రతినిధి అవసరాల దేవి తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు టీడీపీ పరిశీలకుడిగా కోరుమిల్లి



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 7: ప్రత్తిపాడు నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడిగా రాజమహేంద్రవరానికి చెందిన ఆ పార్టీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కోరుమిల్లి విజయశేఖర్ నియమితులయ్యారు. ఆయన రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ గత పాలక మండలి టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా సేవలందించారు. ఇప్పుడు ఆయన్ను ప్రత్తిపాడు పరిశీలకుడిగా పార్టీ నియమించింది.

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా రామ్మోహన్



కాకినాడ సిటీ, జనవరి 5: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా కాకినాడకు చెందిన వల్లూరి రామ్మోహన్ నియమితులయ్యారు. 20ఏళ్లుగా పార్టీకి ఎనలేని సేవలం దించిన ఆయనకు ఈ పదవి లభించడం పట్ల పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటరమణ అభినందించారు. తనకు ఈ పదవి లభించడంతో రామ్మోహన్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

పండిత పరిషత్ అధ్యక్షుడిగా పెద్దబ్బాయి

కొత్తపల్లి, జనవరి 7: పండిత పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా మండలంలో వాకతిప్పకు చెందిన కె.పెద్దబ్బాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రకౌన్సిల్ సమావేశంలో నూతన జిల్లా శాఖల ఏర్పాటులో భాగంగా జిల్లాకు కార్యవర్గంలో తనను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు పెద్దబ్బాయి ఆదివారం తెలియజేశారు. ప్రధాన కార్యదర్శిగా కె.సురేఖ, కోశాధికారిగా బీ.సుబ్రహ్మణ్యం, మహిళా కార్యదర్శిగా జి.ప్రమీల, ప్రచారకార్యదర్శిగా టి.విజయరత్నం, ఉపాధ్యక్షుడిగా ఆర్.నీలకంఠశర్మ ఎన్నుకున్నారు.

విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా వీరబ్రహ్మం

కిర్లంపూడి, జనవరి 7: జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా అత్తిలి వీరభద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కాకినాడలో జరిగిన విశ్వ బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయనను అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా కోటనందూరుకు చెందిన ముదపాక రమణను ఎన్నుకున్నారు. పలువురు అభినందనలు తెలిపారు.

సంక్రాంతి పోటీల నిర్వహణపై చర్చ

కరప, జనవరి 7: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావుల నేతృత్వంలో సంక్రాంతి పోటీల నిర్వహణపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో చర్చ జరిగింది. సంక్రాంతి ఈనెల 9న నడకుదురు, పెనుగుదురు, ఉప్పలంక, గురజనాపల్లి, కొరుపల్లి, జడ్.బావారం, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, పాతర్లగడ్డ గ్రామాల్లోను.. 10న వలసపాకల, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు, వేళంగి, కూరాడ, సిరిపురం గ్రామాల్లోను.. 11న కరప, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, విజయరాయుడు పాలెం, జి.బావారం, యండమూరు గ్రామాల్లోను పోటీలు జరుగుతాయని తెలిపారు. సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు రొక్కాల గణిరాజు, రెడ్డిపల్లి రమేష్ ఉన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరికలు

కాకినాడ రూరల్, జనవరి 7: రూరల్ మండలం రమణయ్యపేట, స్వామినగర్, గైగోలుపాడు ప్రాంతాలకు చెందిన సుమారు 100మంది వైసీపీ నాయకులు ఆదివారం జనసేనలో చేరారు. జనసైనికులు గుత్తుల సత్తిబాబు, తాటికాయల వీరబాబు, పంపన మహేష్ ఆధ్వర్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు జనసేనలో చేరగా పీఏసీ సభ్యుడు, కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పంతం నానాజీ వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శిరంగు శ్రీనివాసరావు, పుల్ల శ్రీరాములు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

కాకినాడ రూరల్, జనవరి 7: రూరల్ మండలం చీడిగలోని ఏటికాలువ గట్టు పేకాట శిబిరంపై, అదేవిధంగా తూరంగిలోని ఉప్పు మళ్ల వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఇంద్రపాలెం పోలీసులు ఆదివారం దాడిచేసి మొత్తం 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ మణికుమార్ తెలిపారు. చీడిగలో పేకాడుతున్న ఏడుగురి నుంచి రూ.1220, తూరంగిలో పేకాడుతున్న ముగ్గురి నుంచి రూ.1500 స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.











కాకినాడ ముగ్గుల పోటీల్లో పాల్గొని కన్సోలేషన్ బహుమతులు అందుకుంటున్న రాజకుమారి, మణి, శోభ

ముత్యాల ముగ్గుల పోటీలు

సంక్రాంతి సందర్భంగా కాకినాడలోని పీఆర్ కాలేజీ ఎదురుగా ఉన్న మెక్లరిన్ హైస్కూల్‌లో ఆదివారం ముత్యాల ముగ్గుల పోటీలు జరిగాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, కెనరా బ్యాంక్, ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. పోటీలకు స్పాన్సరర్‌గా కాకినాడకు చెందిన సానా సతీష్ ఫౌండేషన్ వ్యవహరించింది.

- కాకినాడ సిటీ





అతిథులకు ఆహ్వానం



జ్ఞాపిక అందజేత



లోగోలు వేసిన వారికి బహుమతులు

'ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలి'



స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న సీవోవో మురళీధర్

కాకినాడ రూరల్, జనవరి 7: విద్యార్థులు తాము పొందిన స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని కాకినాడ సీపోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీవోవో మెర్ల మురళీధర్ పేర్కొన్నారు. కాకినాడ కమ్మకళ్యాణమండపంలో కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో వివిధ కులాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభగల విద్యార్థులకు ఆదివారం స్కాలర్‌షిప్‌ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చుండ్రు గోవిందరాజు అధ్యక్షత వహించగా మురళీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గోవిందరాజు మాట్లాడుతూ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ప్రతిఏడాది ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, పీజీ చదువుతున్న పేద విద్యార్థులకు నగదురూపంలో స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని, ఈఏడాది 51మంది విద్యార్థులకు రూ.10,20,000 లను స్కాలర్‌షిప్‌లుగా అందించామని తెలిపారు. ఈసందర్భంగా మురళీధర్, కృష్ణవేణి దంపతులను కమ్మ మహాజన సంఘం తరఫున గజమాల, దుశ్శాలువా, మెమెంటోతో సత్కరించారు. శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ గారపాటి కళ్యాణ్, సంయుక్త కార్యదర్శి జీవీఎస్టీ రాయుడు, కోశాధికారి వెంకట్రావు, రావిపాటి రామారాయచౌదరి, జాస్తిమూర్తి, రవీంద్రనాద్‌చౌదరి, కమ్మ మహాజనసంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసనలు



పెద్దాపురంలో జీవో ప్రతులను తగలబెడుతున్న దృశ్యం

పెద్దాపురం, జనవరి 7: తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో జగన్ భవిష్యత్తును నిర్ణయించేది తామేనని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు దాడి బేబీ అన్నారు. అంగన్‌వాడీల సమ్మె ఆదివారానికి 27వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ జంక్షన్ వద్ద అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి జీవో నంబర్ 2 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నాగమణి, అమల, అంగన్‌వాడీ యూనియన్, సీఐటీయూ నాయకుడు దారపురెడ్డి క్రాంతికుమార్, కార్యకర్తలున్నారు.

తుని రూరల్: తునిలో అంగన్‌వాడీలు నల్లరిబ్బలు, చేతికి సంకెళ్లు వేసుకుని నిరసన చేపట్టారు. జీవో 2 ప్రతులను దహనం చేసి తమ హక్కులను కాలరాస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్, రమణ, ధనలక్ష్మి,ఉమామహేశ్వరి ఉన్నారు.

కిర్లంపూడి: అంగన్‌వాడీల సమ్మెలో సంఘం అధ్యక్షురాలు రత్నం మాట్లాడారు. పలువురు మద్దతు తెలిపారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లో అంగన్‌వాడీలు జీవో 2 ప్రతులను దహనం చేసి చేసి నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జేఎన్టీయూకే, జనవరి 7: పూర్వవిద్యార్థులు తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి సహకరించి మరింత అభివృద్ధిబాటలో పయనించేలా కృషి చేయాలని ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు కోరారు. వర్సిటీలోని సెనేట్‌హాల్లో ఆదివారం ఎకోశాక్ పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా వీసీ మాట్లాడుతూ జేఎన్టీయూకేలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నతస్థానాల్లో ఉన్నారని, వారిని ప్రస్తుత విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులను అందజేసి ఎకోశాక్ 2024 కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, విభాగాధిపతులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడలో కైట్ ఫెస్టివల్

కాకినాడ సిటీ, జనవరి 7: నగరంలో మొదటిసారిగా యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. కాకినాడ పైండా ఆండాళ్లమ్మ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఫెస్టివల్‌లో పెద్దసంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా రంగురంగుల గాలిపటాలను ఎగురవేశారు. ముఖ్య అతిథులుగా కాకినాడ ఎంపీ వంగా గీత, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, గౌరవఅతిథిగా ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పూర్ణచంద్రరావు హాజరయ్యారు. ఫెడరేషన్ కన్వీనర్ సుజ్జాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రైవేట్ విద్యాసంస్థల లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎర్రంశెట్టి సురేష్, కాకినాడ అధ్యక్షుడు ఇదయతుల్లా, ప్రధాన కార్యదర్శి రఘురామకృష్ణ, సామర్లకోట డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్‌పాఠశాలల కరస్పాండెంట్స్ షబ్బీర్, ఈశ్వరరావు ఉన్నారు.

వేట్లపాలెంలో గడ్డి వాము దగ్ధం

సామర్లకోట, జనవరి 7: వేట్లపాలెంలో మొక్కరావిచెట్టు సెంటర్ నుంచి మంగయ్యమ్మ కాలనీకి వెళ్లే రోడ్డులో రైస్ మిల్లు సమీపాన రాయుడు శ్రీను అనే రైతుకు చెందిన 10 ఎకరాల గడ్డి వాము ఆదివారం అగ్నిప్రమాదానికి గురైంది. ఎవరో కాల్చి పారేసిన సిగరెట్ వల్ల అగ్ని రాజుకుని మంటలు వ్యాపించాయి. పెద్దాపురం అగ్నిమాపకదళ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.లక్ష మేర ఆస్తినష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు.

సైకో ముఖ్యమంత్రిని సాగనంపాలి

మాజీ మంత్రి చిక్కాల, మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో మాట్లాడుతున్న చిక్కాల, వర్మ

పిఠాపురం, జనవరి 7: సైకో ముఖ్యమంత్రిని సాగనంపాలని ప్రజలంతా ఎదురుచూస్తున్నారని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ సైకో జగన్‌పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, అన్నివర్గాలు ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదని తెలిపారు. తునిలో ఈనెల 10న జరిగే రా కదలిరా భారీ బహిరంగసభకు నియోజకవర్గం నుంచి పదివేల మందికి పైగా తరలివెళ్తున్నట్టు వర్మ తెలిపారు. సభను విజయవంతం చేయాని వర్మ, చిక్కాల కోరారు. సమావేశంలో నియోజకవర్గంలోని నాయకులున్నారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేశారు

గొల్లప్రోలు రూరల్, జనవరి 7: వైసీపీ పాలనలో ప్రజాసమస్యలను గాలికొదిలేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. టీడీపీ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, వినయ్‌నాయుడు తదితరులున్నారు.

సైకో పాలన భరించలేకే వలసలు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ



గండేపల్లి : టీడీపీలో చేరినవారితో నెహ్రూ

గండేపల్లి, జనవరి 7: సీఎం జగన్ సైకో పాలన భరించలేకే సహనం కోల్పోయిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు తిరుగుబాటు చేసి టీడీపీలోకి వలసలు వస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని మల్లేపల్లి అనపరాజుపేట కాలనీలో టీడీపీ నాయకులు లంక శ్రీను, తలారిబాబు,కొల్లు త్రిమూర్తులు, పాతాళ అప్పారావు, బలిరెడ్డి చిన్నోడు, మాజీ సర్పంచ్ గ్రంధి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. నెహ్రూ వారికి పార్టీ కండువా కప్పిసాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, తప్పుడు నిర్ణయాలతో రాష్ట్రం 30ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజాదరణ టీడీపీకి ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, కొత్త కొండబాబు, బొండా శ్రీనుబాబు, యర్రంశెట్టి బాబ్జి, తెలగరెడ్డి భద్రరావు, వలబశెట్టి కోటేశ్వరరావు, కాటేపల్లి భద్రం, గ్రంధి నాగబాబు, తాడ్రంకి శ్రీను, మండే శ్రీను, బ్రహ్మం, కలిమి శివ తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

జగ్గంపేట, జనవరి 7: రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో మండలంలో వెంగయ్యమ్మపురానికి చెందిన వైసీపీ నాయకురాలు అప్పాన అమ్మాజీ, దాసరి చిన్న, వల్లెపు భాస్కరరావు, వల్లెపు శ్రీను తదితరులు వైసీపీకి రాజీనామా చేసి జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షులు మారిశెట్టి భద్రం, పాండ్రంగి రాంబాబు, వల్లెపు అన్నవరం, గెడ్డం అన్నవరం, శరికాని సుబ్బారావు, దశరథ బాలాజీ, రాయి సాయి, వెలిశెట్టి బుజ్జి, నలమాటి ఆనంద్,కుప్పా తాతారావు పాల్గొన్నారు.

తునిలో 10న చంద్రబాబు బహిరంగ సభ

జయప్రదంచేయాలని టీడీపీ నేతల పిలుపు



కాకినాడలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, జనవరి 7: జగన్ అరాచక పాలనకు తోడు వైసీపీ వైఫల్యాలే టీడీపీకి గెలుపు బాటలు కాబోతున్నాయని, ఈనెల 10న తునిలో జరిగే చంద్రబాబు రా కదలి రా బహిరంగ సభకు సిటీ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం సిటీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకుడు, అమలాపురం మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, నాగిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కొండబాబు మాట్లాడుతూ వైసీపీ దుర్మార్గపు విధా నాలకు అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయార న్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఎంఏ తాజుద్దీన్, గదుల సాయిబాబు, దండుప్రోలు నాగబాబు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గుత్తుల రమణ, నల్లూరి శ్రీనివాస్, గుజ్జు లక్ష్మణరావు, అంబటి చిన్న, సీకోటి అప్పలకొండ, కొల్లు కుమారి, రిక్కా లక్ష్మి, మోంటారావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: తునిలో ఈనెల 10 నిర్వహించే చంద్రబాబు సభను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు గన్నికృష్ణ, వరుపుల సత్యప్రభ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు ఉన్నారు.

నేడు తెలంగాణ డిప్యూటీ సీఎం రాక

కాకినాడ సిటీ, జనవరి 7: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం కాకినాడ రానున్నారు. సాయంత్రం కాకినాడ చేరుకుని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బస చేయనున్నారు. మంగళవారం ఉదయం ఓ వివాహ రిసెప్షన్‌లో పాల్గొని తిరిగి హైదరబాద్ బయలుదేరి వెళ్లనున్నారు. తెలంగాణ డిప్యూటీ సీఎం కావడంతో పక్క రాష్ట్రం అతిథిగా ప్రొటోకాల్ పాటించాలని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూశాఖ నంచి కలెక్టర్‌కు ఆదేశాలందాయి. సోమవారం రాత్రి ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఉమ్మడి జిల్లా పెద్దలు, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఆయనతో భేటీ కానున్నారు.

నేడు వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జనవరి 7: ఈనెల 8న వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాల ఆధారంగా ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 77993 76333 నెంబరులో సంప్రదించాలని వికాస పీడీ లచ్చారావు కోరారు.

లాడ్జి రూమ్‌బాయ్స్‌ను చితక్కొట్టిన యువకులు

సామర్లకోట, జనవరి 7: పట్టణ పరిధిలో పోలీసు అవుట్‌పోస్ట్, ఆర్టీసీ కాంప్లెక్స్‌కు 300 మీటర్ల దూరంలో గల ఒక లాడ్జిలో రూమ్ బాయ్స్‌ను కొందరు యువకులు చితక్కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనవరి 1న జరిగిన ఈ సంఘటన వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఇటీవల ఒక యువకుడు, మహిళ కలిసి లాడ్జికి వచ్చి రూమ్ తీసుకున్నారు. మరికొద్ది సేపటికి మరికొంత మంది యువకులు అదేరూమ్‌కు చేరుకున్నారు. ఎక్కువ మంది రూమ్‌లో ఉండరాదని ప్రశ్నించిన లాడ్జి బాయ్స్‌పై సదరు రూమ్‌లో ఉన్న యువకులు వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత రూమ్ ఖాళీ చేసి వెళ్లిపోయారు. తదనంతరం రాత్రికి మరికొందరు యువకులతో కలిసి లాడ్జి వద్దకు చేరుకున్నారు. అక్కడే ఎదురైన లాడ్జిబాయ్స్‌లను విచక్షణా రహితంగా యువకులు ఒకడి తర్వాత ఒకరు చొప్పున చితక్కొట్టారు. ఈ దృశ్యాలు లాడ్జి వద్ద ఉన్న సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. లాడ్జిబాయ్‌లను సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఈ సంఘటనపై జనవరి 2న సామర్లకోట పోలీస్‌స్టేషన్‌కు బాధితులు రాజు, పవన్‌సాయి చేరుకుని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తమ ఎవరికి చెప్పుకోవాలని రోదిస్తున్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు

కిర్లంపూడి, జనవరి 7: కాకినాడ జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు మండలంలోని సోమవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక కమిటీ కన్వీనర్ ఎస్.కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్ఎం కెఎం.ప్రసాద్, ఎంఈవో చిన్నారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూది శ్రీను, అనీష్ నెహ్రూ, గంగిరెడ్ల నాగభూషణం, జ్యోతుల కృష్ణమూర్తి, కొమ్మిరెడ్డి భాను, పేపకాయల చంటిబాబు, మచ్చా చిట్టిబాబు, మంచికంటి శ్రీనివాసరావు, జ్యోతుల కోటేశ్వరరావు, జంపన రవివర్మ, సమత కన్వీనర్ మంగతాయారు ఉన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

పిఠాపురం, జనవరి 7: పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి మాస కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, లగ్నాష్టక చూర్ణిక తదితర వేదమంత్రాలతో వేద క్రతువులు నిర్వహించి మంగళవాయిద్యాల నడుమ మాంగళ్యధారణ గావించారు. యాగ్నిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు, ఆలయ అర్చకులు విజయజనారధనాచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరగగా, ఆలయ ఈవో నున్న శ్రీరాములు దంపతులు తదితరులున్నారు.

దుర్గమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి, జనవరి 7: మండలంలో మురారి గ్రామ శివారులో వెలిసిన కనకదుర్గమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎస్.రామకృష్ణ అధ్యక్షతన పోలీస్ గస్తీ నిర్వహించి శాంతి భద్రతలను పరిరక్షించారు.

యోగా శిక్షణా తరగతుల ప్రారంభం

పిఠాపురం, జనవరి 7: పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో ఆదివారం యోగా శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. శ్రీపీఠికాపురం యోగా విద్యాపీఠం ఆధ్వర్యంలో రోజూ ఉదయం 6నుంచి 8గంటలకు వరకూ ఉచితంగా తరగతులు ఉంటాయని, పాల్గొనేవారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో అంతర్జాతీయ యోగా సేవక్ అవార్డు గ్రహీత వనం సత్యప్రియ, కొండేపూడి శంకరరావు, పెమ్మరాజు సత్యరామచంద్రరావు, అల్లవరపు నగేష్, నల్లా శ్రీను, డాక్టర్ రోజాప్రియ, వనం వీరబాబు తదితరులున్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

ప్రత్తిపాడు, జనవరి 7: ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ స్థాపించి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం మండలంలోని బౌరువాక గ్రామంలో గిరిజనులకు లయన్స్ క్లబ్ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా లయన్స్ గవర్నర్ ఎ.గోపాలరావు, లయన్స్ ఇంజనీర్ మోహన్, రెడ్డి నాయుడు, ఫకీర్ రాజు, గుడాల వెంకటరత్నం పాల్గొన్నారు. అనంతరం లయన్స్ కమ్యూనిటీ హాల్లో క్లబ్ కార్యవర్గ సమావేశం జరిగింది.

18 మందిపై బైండోవర్ కేసులు

కరప, జనవరి 7: గొర్రిపూడి గ్రామానికి చెందిన 18 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. గతంలో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ఈ నిందితులను తహశీల్దార్ సమక్షంలో హాజరుపరిచి బైండోవర్ చేసినట్టు చెప్పారు. సంక్రాంతిని పురస్కరించుకుని జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గండేపల్లిలో ఆత్మీయ సమావేశం

గండేపల్లి, జనవరి 7: గండేపల్లిలో ఆదివారం నిర్వహించిన వైసీపీ ఆత్మీయ సమావేశానికి మాజీ మంత్రి తోట, జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జి తోట నరసింహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, రఘురాం, మూర్తి, గల్లా ఏడుకొండలు, మదిపట్ల రామకృష్ణ, పరిమి వెంకటేశ్వరరావు, సురేష్‌కుమార్, టి.మధుకుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జగ్గంపేట, జనవరి 6: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆటో యూనియన్ సభ్యుడు గూనపల్లి లక్ష్మణరావు కుటుంబానికి హెరిటేజ్ డెయిరీ ప్రతినిధి సరకనం కన్నారావు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు.